క్లుప్తంగా

రేపటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 15 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. వర్సిటీ పరిధిలోని 104 కళాశాలల నుంచి రెగ్యులర్‌గా 8422 మంది, సప్లిమెంటరీగా 6623 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. 62 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

16న జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 16న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 6వ స్థాయి, 11 గంటలకు 3వ స్థాయి, 12 గంటలకు 5వ స్థాయి, మధ్యాహ్నం 2 గంటలకు 2వ స్థాయి, 3 గంటలకు 4వ స్థాయి, 4 గంటలకు 7వ స్థాయి, 5 గంటలకు 1వ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహిస్తామని వివరించారు. శాఖాధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఏకాంబరేశ్వర కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాండ్రంగి వీధిలోని కామాక్షి దేవి పీఠంలో ఏకాంబరేశ్వర కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదుల వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కె.ఆనంద్, గ్రంధి వెంకటగణేష్ గుప్త, వేదుల వెంకట సూర్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ సచివాలయం నుంచి రుప్పపేట వరకూ రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న బీటీ రోడ్డు పనులను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి బుధవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ, పనుల్లో నాణ్యత పాటించాలని, రెండు వైపులా బెర్ములు ఉండాలని సూచించారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ బెండు రామారావు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎనర్జీ అసిస్టెంట్లు




ఎమ్మెల్యే కిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

రణస్థలం: ఎనర్జీ అసిస్టెంట్లను గ్రామ సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోషియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను బుధవారం రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వం నియామకాలు చేపట్టినా ఎనర్జీ అసిస్టెంట్లను మాత్రం విస్మరించిందని చెప్పారు. విద్యుత్ శాఖలో మార్పులు తెచ్చి సచివాలయ ఉద్యోగులతో సమానంగా గుర్తింపు తీసుకురావాలని కోరారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

రణస్థలం: వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. అల్లివలస, కొవ్వాడ, పాతర్లపల్లి, ఎన్‌జీఆర్ పురం గ్రామ సచివాలయాలు పరిధిలో ఐదుగురు కొత్త వలంటీర్లకు బుధవారం రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పున్నయ్య

ఎచ్చెర్ల : దివ్యాంగులకు ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని ఎంఈఓ కారు పున్నయ్య అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలోని భవిత కేంద్రం వద్ద దివ్యాంగులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 గాలి రాజకిషోర్, ఐఈఆర్‌టీలు కె.అరుణకుమారి, ఎస్.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ఘనంగా పోలిపాడ్యమి పూజలు
- నదిలో దీపాలు వెలిగించిన మహిళలు
- ఆలయాల వద్ద అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: పోలిపాడ్యమి సందర్భంగా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మార్గశిర మాసంలో వచ్చే మొదటి రోజున నదిలో దీపాలు వెలిగిస్తే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో బుధవారంగుడివీధి కోటేశ్వరాలయం వద్ద నాగావళి నదీ రేవుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు వదిలారు. బలగ, కలెక్టర్ బంగ్లా రేవుల్లోనూ భక్తులు నదిలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దలకు పొత్తర్లు నివేదించారు.

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ముగిసిన సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పోలిపాడ్యమి పురస్కరించుకుని మహిళలు నదిలో దీపాలు వదిలారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు లోకనాధం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస కొండ, ఆనందపురం, టీడీవలస, వెంకయ్యపేట తదితర గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. సాయి, భవాని, శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలోని రామాలయంలో పోలిపాడ్యమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో పోలిపాడ్యమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.



దీపాలు వదులుతున్న భక్తులు..



నదిలో దీపాలు వదులుతున్న మహిళలు



నాగావళి నదిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అరటి దవ్వపై దీపం వదులుతూ..



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరస్వామి



శ్రీకాకుళం కల్చరల్: కల్యాణ వేంకటేశ్వరాలయం వద్ద అన్నదానం



శ్రీకాకుళం కల్చరల్: నాగావళి నది వద్ద దీపాలు



జి.సిగడాం: ఆనందపురంలో అన్నదానం



ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో అన్నసమారాధన

పుష్కరిణి పనుల శంకుస్థాపనకు సన్నద్ధం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఇంద్రపుష్కరిణి ఆధునీకరణ పనులకు ముహూర్తం ఖరారయ్యింది. ఈ నెల 20న ఉదయం 9.09 గంటలకు శంకుస్థాపన చేసేందుకు ఆలయ వర్గాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, గోవిందరావు, శ్రీనివాస్, జోగి మల్లెమ్మ తదితర బృందం బుధవారం మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణిని ఆధునీకరణ చేస్తామని చెప్పారు. దేవదాయ శాఖ రూ.2 కోట్లను కేటాయించగా, ఆలయం తరఫున రూ.2 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. శంకుస్థాపన అనంతరం పుష్కరిణిలో నీటిని తోడించి పనులు ప్రారంభిస్తామని మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ద్వారపు అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ధర్మానకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో, తదితరులు

కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీకాకుళం కల్చరల్: రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త నిర్వహణలో బుధవారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని కాటరాక్టు శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె.త్రినాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రోటరీ అధ్యక్షులు డాక్టర్ వై.గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేత్ర విభాగాధిపతి డాక్టర్ పి.నిర్మలజ్యోతి, నేత్ర వైద్య నిపుణులు బి.కె.జైన్, ఎస్.పుష్పలత, పి.శేషుబాబు, వై.సుష్మశాంతి, చక్రధర్, సౌమ్య, ఆప్తాలమిక్ అధికారులు ఎంఆర్‌కే దాస్, ఎం.బాబూరావు, రోటరీ కార్యదర్శి అన్నెపు అనంతరావు, ప్రతినిధులు మంత్రి వెంకటస్వామి, జైశ్రీరామ్, పి.సూర్యనారాయణ, డి.సంతోష్‌కుమార్, బి.శ్రీనివాస, డి.శివశంకర్, సీహెచ్.జగదీశ్వరరావు, ముని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రైతులకు ఆసరాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. భగీరథపురం గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవానం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు ధాన్యం అమ్మవద్దని, ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం ఉన్న ధాన్యం సైతం కొనుగోలు చేయాలన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత సర్కారు చేపడుతున్న రైతు సంక్షేమం మధ్య వ్యత్యాసాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ బగ్గు రజిని, తహశీల్దార్ టి.సత్యనారాయణ, వ్యవసాయాధికారి సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, ఎంపీటీసీ కొమర సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

పారదర్శకంగా పథకాల మంజూరు



గార: దీపావళిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం గొంటి సచివాలయం వద్ద ఎంపీపీ గొండు రఘురామ్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని సానివాడ సచివాలయం పరిధిలోనూ సంక్షేమ బోర్డును ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రతి ఇంటికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంత,ం దీపావళిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ కోట రామారావు, వైస్ ఎంపీపీలు అంధవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, యాళ్ల నారాయణమూర్తి, అంబటి చినబాబు, శిమ్మ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం : సేతు భీమవరంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

జి.సిగడాం: సేతుభీమవరం గ్రామ సచివాలయం వద్ద మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యులు కుదిరెళ్ల గోవిందరావు, నాగవరపు సాయి, మాజీ సర్పంచ్ ఇప్పిలి త్రినాథరావు, ఈఓపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

జి.సిగడాం: నిరుపేదలమైన తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని పాలఖండ్యాం గ్రామానికి చెందిన అంపావల్లి శారద, సింగవరపు లక్ష్మి, చిట్టి రమణమ్మ, డొప్ప నరసమ్మలతోపాటు మరో ఆరుగురు బుధవారం తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు విన్నవించుకున్నారు. ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, భూపట్టాలు ఇస్తే గృహాలు నిర్మించుకుంటామని చెప్పారు.

గోపి నియామకంపై హర్షం



హర్షం ప్రకటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లావేరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా లావేరు గ్రామానికి చెందిన లంకలపల్లి గోపిని నియమించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం లావేరు గ్రామంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడి దాము, నాయకులు లంకలపల్లి నారాయణరావు, ఇనపకుర్తి చలపతి, లంకలపల్లి మహేష్, డోకల ముకుందరావు, పడాల పాపారావు, తలారి నాగయ్య, మహదాసు చక్రదరరావు, రౌతు శ్రీనివాసరావు. దోర వెంకటరమణ, నక్కెన అశిరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో సుమారు రెండు లక్షల జనాభా కలిగి బడుగు, బలహీన వర్గాలుగా ఉన్న శ్రీశయనుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఖేలో ఇండియా పోటీల్లో రూపాదేవికి రజతం



జి.సిగడాం: ఢిల్లీలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన ఖేలో ఇండియా పారా బ్యాడ్మింటన్ పోటీల్లో జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు బుధవారం ఖేలో ఇండియా కమిటీ సభ్యులు రజత పతకాన్ని ప్రదానం చేశారు. రూపాదేవి థాయిలాండ్‌లో ఈ నెల 5 నుంచి 8 వరకు నిర్వహించిన వరల్డ్ ఎబిలిటి స్పోర్ట్స్ గేమ్స్‌లోనూ రెండు పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రూపాదేవిని గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు

అరసవల్లి: ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగే జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 15న అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జనవరి 5న ఓటర్ల తుది జాబితా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల అనంతరం ఓటర్ల తుది జాబితా జనవరి 5న వెలువడనుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అంశాల వారీగా సమీక్షించారు. పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుని విజ్ఞప్తులు స్వీకరించారు.

మెరుగైన విద్యా ప్రమాణాలే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన విద్యా ప్రమాణాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. ఎస్‌ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నాక్ బృందం (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) ఈ నెల 27 నుంచి మూడు రోజుల సందర్శన ఉన్న నేపథ్యంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు నాక్ గుర్తింపు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో ఆర్‌జీయూకేటీ సంస్థ అతిపెద్ద రెసిడెన్సియల్ క్యాంపస్‌గా తెలిపారు. క్యాంపస్ ప్రగతి సాధించాలంటే జాతీయ స్థాయిలో నిధులు కీలకమని చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నాక్ వంటి గుర్తింపు లభిస్తే జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయానికి గుర్తింపు లభిస్తుందని, తద్వారా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ నుంచి నిధులు వస్తాయన్నారు. ఇప్పటికే వర్సిటీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు వివరించారు. విశ్వవిద్యాలయంలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్య ఆధారిత విద్య అందిస్తూ రిలీవ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు లభించేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.డి.సుధాకర్, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వ హిస్తున్న చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు గిరిధర్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధర్మాన గిరిధర్ ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి 23 వరకు దేశ రాజధాని ఢిల్లీలో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ధర్మాన గిరిధర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. అంతకుముందు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు తృతీయస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో గిరిధర్ మెరుగైన ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ పీడీ రాజనాల సతీష్‌రాయుడు తెలిపారు. విద్యార్థితో పాటు పీడీని హెచ్‌ఎం ఐడీవీ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మొయ్యిల వాసుదేవ రావు, గ్రామపెద్దలు బాణాల గాంధీ, పంచిరెడ్డి అప్పలనాయుడు, బాణాల బలరాం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.



ధర్మాన గిరిధర్‌ను అభినందిస్తున్న ఐడీవీ ప్రసాద్, సతీష్‌రాయుడు

బహుళ పంటల సాగుపై అవగాహన

జి.సిగడాం: ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి ప్రకాశరావు అన్నారు. బుధవారం జగన్నాథవలసలో మొక్కజొన్న పంటలో బహుళ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ నీరు, పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే దిశగా రైతులు పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు హేమసుందరరావు, కృష్ణ అగ్రికల్చర్ అసిస్టెంట్ అంపోలు అనూష తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాష్ట్ర, జాతీయ స్విమ్మింగ్ పోటీలకు దరహాస్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒకవైపు రాష్ట్రస్థాయి పోటీలకు, మరోవైపు జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన స్టార్ స్విమ్మర్ వేమకోటి ధనుష్య దరహాస్ ఏకకాలంలో ఎంపికయ్యాడు. స్విమ్మింగ్ అసోసియేషన్ స్టేట్ మీట్‌కు, స్కూల్‌గేమ్స్ నేషనల్ మీట్‌లలో ప్రాతినిధ్యం వహించనునున్నాడు. ఈ పోటీల కోసం దరహాస్ సన్నద్ధమౌతున్నాడు. ఈ మేరకు బుధవారం స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కెఎస్ఎస్‌వీ(హారిక) ప్రసాద్ తన నివాసంలో అభినందించారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం అరసవల్లి అధ్యక్షుడు కరణం సోభారాణి, కోశాధికారి తర్లాడ అప్పలనాయుడు సమక్షంలో దరహాస్‌ను అభినందించి పోటీలకు వెళ్లేందుకు అవసరమైన సాయాన్ని అందజేశారు. దరహాస్ ఎంపిక పట్ల శ్రీచైతన్య కాలేజ్ ఏజీఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు హర్షం వ్యక్తంచేశారు.



దరహాస్‌ను అభినందిస్తున్న హారికాప్రసాద్

జాబ్‌మేళాలో 84 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ సూచించారు. బలగ హాస్పిటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ శిక్షణా సంస్థ వేదికగా జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఎంఎన్‌సీ ఎంపెనీలతో పాటు స్థానికంగా ఉన్న 15 సంస్థలు/కంపెనీలలో 695 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 303 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, లిఖిత, మౌఖిక పరీక్షల ఆధారంగా 84 మంది ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, ఐటీఐ సంస్థ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ